www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబరు 2022
5
ఏలూరు



ఎవరికైనా ధాన్యం విక్రయించుకోవచ్చు

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మంజు భార్గవి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఏలూరు ప్రతినిధి: కొన్నది సగం ధాన్యమే అంటూ ఈనెల ఎనిమిదో తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏలూరు జిల్లాలో 3.80 లక్షలు టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకుని ఆ దిశగా ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర కల్పించాలని ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ మంజు భార్గవి తెలిపారు. మద్దతు ధర విషయంలో చైతన్యం కల్పించామని, రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద మాత్రమే అమ్మకం చేయాలనే నిర్బంధమేమీ లేదన్నారు. రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు తగ్గకుండా స్వేచ్ఛగా బహిరంగంగా ఎవరికైనా ధాన్యం విక్రయించుకోవచ్చని ప్రజాశక్తికి తెలిపారు.

ఉత్సాహభరితం.. ఉత్తేజపూరితం

అట్టహాసంగా వ్యకాస రాష్ట్ర మహాసభ ప్రారంభం
మార్కెట్ యార్డ్ నుంచి బస్టాండ్ వరకూ భారీ ప్రదర్శన
వేలాది మంది జనం నినాదాలతో మార్మోగిన జంగారెడ్డిగూడెం
నేతల ప్రసంగాలతో సభికుల్లో నూతనోత్సాహం
జగన్, చంద్రబాబు పేదల భూములపై నోరుమెదపరు
జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్
మోడీ ఆదేశిస్తే జగన్ అమలు
జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



బృందాకరత్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/జంగారెడ్డిగూడెం/టి.నరసాపురం

వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ గురువారం ఏజెన్సీ ముఖద్వారం జంగారెడ్డిగూడెంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటలకు మార్కెట్ యార్డ్ నుంచి బస్టాండ్ వరకూ భారీ ప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో గిరిజనోద్యమ నేత జాతీయ నాయకురాలు బృందాకరత్, వ్యవసాయ కార్మికసంఘం అఖిల భారత అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, జాతీయ కార్యదర్శి బి.వెంకట్, రూరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ చందన్, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి, వ్యకాస జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, వ్యకాస నేతలు తామా ముత్యాలమ్మ, ఎం.జీవరత్నం, గిరిజన సంఘం జిల్లా నేత తెల్లం రామకృష్ణష్ణతోపాటు, పలవురు నేతలు, వేలాది మంది జనం పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో అంతా ఎర్రజెండాలు చేతబూనడంతో జంగారెడ్డిగూడెం ప్రాంతమంతా అరుణారుణమైంది. వేలాది మంది నినాదాలతో పట్టణమంతా మార్మోగింది. బస్టాండ్ సమీపంలో కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్మారక ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభకు వేలాది మంది వ్యవసాయ కూలీలు, గిరిజనులు విచ్చేశారు. తొలుత నెల్లూరు జిల్లా అలగానిపాడు నుంచి తీసుకొచ్చిన అమరవీరుల జ్యోతిని బృందాకరత్‌కు, ఎర్రకాల్వ మిగులు భూముల పోరాట నేతలు తీసుకొచ్చిన జ్యోతిని విజయ రాఘవన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త బృందాకరత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు, వ్యవసాయ కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ మాట్లాడుతూ చంద్రబాబు అమరావతి అని, జగన్ మూడు రాజధానులు అని అనడం తప్ప పేదల భూముల గురించి ఇరువురు మాట్లాడరని విమర్శించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే పేదల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, భూములు లేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. దేశంలో 60 శాతం జనాభాకు భూమి లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి భూమిచ్చేందుకు సహకరించడం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తోందన్నారు. రైతులు, కార్మికులు అంతా కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు.



మాట్లాడుతున్న విజయరాఘవన్

ఎరుపెక్కిన పోరాటాల పురిటిగడ్డ జంగారెడ్డిగూడెం

పోరాటాల పురిటి గడ్డ, ఏజెన్సీ ముఖ ద్వారం జంగారెడ్డిగూడెం ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ ర్యాలీ మహాప్రదర్శనలో వ్యవసాయ కార్మికులు భూమి పంచాలి, కూలి పెంచాలి నినాదాలతో కదం తొక్కారు. ప్రదర్శనలో ముందు భాగాన గిరిజన సాంస్కృతిక నత్యాలైన రేల డాన్సులు, డోలు వాయిద్యాలు, డప్పుల దరువులు, జానపద నత్యాలతో ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగింది. అలాగే మతసామరస్యం చాటుతూ హిందూ ముస్లిం క్రిస్టియన్ వేషధారణలు, వ్యవసాయ పనిముట్ల, కూలీల వేషధారణలతో అలరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ట్రాక్టర్ పై ఏర్పాటు చేసిన భలే మంచి చౌక బేరం శకటాలు వ్యంగ్య అస్త్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి తరలొచ్చిన వ్యవసాయ కార్మికులు ఎర్రజెండాలు చేత పట్టి పెరిగేధరలకు హద్దు లేదు ఏలే వాడికి బుద్ధి లేదు, పేదలకు భూములు పంచేవరకు పోరాడుతాం, దున్నే వానికి వారికి భూమి పంచాలి, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి, పని దినాలు 200 రోజులకు పెంచాలి, కనీస వేతనం 600 ఇవ్వాలి, జగనన్న నవరత్నాల్లో భూపంపిణీ చేర్చాలి, కేరళ తరహాలో నిత్యావసర వస్తువులు ఇవ్వాలి, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి, మతం పేరుతో మారణ హోమం చేయొద్దు, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ చేసిన నినాదాలతో పట్టణం హోరెత్తింది.

అడవిని కార్పొరేట్లకు కట్టబెడుతున్న పాలకులు

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బిజెపికి వైసిపి ఎంపీలు వంతపాడుతూ ఆదివాసీల అడవిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం భూమి పంచాలని పోరాడుతున్న జానపద గీతం పాడుతూ కళాకారులతో కలిసి నృత్యం చేశారు.

మోడీ ఆదేశిస్తే జగన్ అమలు

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ మోడీ ఆదేశిస్తే జగన్ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ఎపి, తెలంగాణాల్లో బిజెపిని ఓడించేందుకు ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. ఏజెన్సీలో భూములను అదానికి అప్పగిస్తున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటం సాగించాలన్నారు. పెన్షన్, పెళ్లికానుక ఇస్తే జీవితాలు మారవని, భూములు గురించి మాట్లాడాలని అన్నారు. 15 ఏళ్ల క్రితం 250 ఉన్న డిఎపి బస్తా ధర ఇప్పుడెంత అని ప్రశ్నించారు. పెట్రోలు, డీజిల్ ధరలు ఎంత పెరిగాయో చూడాలన్నారు. కాంగ్రెస్‌కు పట్టిన గతే జగన్‌కూ పడుతుందన్నారు. జంగారెడ్డిగూడెంలో బిజెపి, కాంగ్రెస్, టిడిపి ఏఒక్కరూ పోరాటాలు చేయలేదని, ఎర్రకాల్వ భూములు 11 వందల ఎకరాలను సంఘం ఆధ్వర్యాన సాగు చేయిస్తున్నామని తెలిపారు. ఓట్లు, సీట్లు రావొచ్చు, పోవొచ్చని, నిర్వాసితులకు ఎర్ర జెండా అండగా నిలుస్తుందన్నారు.

కార్మికులకు ఎర్రజెండా అండ

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎస్‌కె.సాబ్జీ

సంపద సృష్టించేది కార్మికులైతే దోచుకునేది పాలకులు అని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. 18 వేల కోట్ల ఆస్తిపరుడైన అదానికి మోడీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు కార్మిక సంపదను దోచిపెట్టిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో మాధవరం, బెస్తగూడెం, ఎల్లప్పగుడెం, కౌండిన్యముక్తి గ్రామాలను చేర్చాలన్నారు. ఈ గ్రామాల్లో తొమ్మిది అడుగుల లోతు వరద నీరు ప్రవహించిందన్నారు. నేడు రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పేదల సమస్యలపై హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని అన్నారు.

బృందా కరత్‌కు ముస్లిం మహిళల సన్మానం

మాజీ ఎంపీ, గిరిజనోద్యమ జాతీయ నాయకురాలు బృందాకరత్‌ను స్థానిక ముస్లిం మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు. బహిరంగ సభ వేదికపై బందాకరత్‌ను పట్టణ ముస్లిం సోదరులు, సోదరీమణులు కలిసి కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు షేక్ ముస్తఫా మాట్లాడుతూ భారతదేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లిములు, క్రైస్తవులపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. దాడులు జరిగిన ప్రతిసారీ ఎర్రజెండా సోదరులు మైనార్టీ సోదరులకు అండగా నిలిచారన్నారు. ఎర్రజెండా సోదరుల అండదండలు ఉండబట్టే భారతదేశంలో ముస్లిం క్రైస్తవులు ధైర్యంగా బతకగలుగుతున్నారన్నారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎ, హిజాబ్ వంటి ప్రతి విషయంలోనూ ఎర్రజెండా సోదరులు అండగా నిలబడుతున్నారన్నారు. ఢిల్లీలో బుల్డోజర్లతో ముస్లింల ఇళ్లు కూలుస్తున్నప్పుడు బందాకరత్ ధైర్యంగా బుల్డోజర్లకు ఎదురు నిలిచి ఇల్లు కూల్చివేతను వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బందాకరత్‌కు ముస్లిం మహిళలు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

పేదలకు భూపంపిణీ చేస్తేనే పేదరికం నిర్మూలించబడుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు అన్నారు. 1946-51 వరకు తెలంగాణలో మూడు వేల గ్రామాల్లో 10 లక్షల మందికి భూములు పంచిన చరిత్ర ఎర్ర జెండాకు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 195 సంఘాలను ఐక్యం చేసిన భూపోరాటంలో ఏడుగురు అమరులై భూములు సాధించుకున్నామన్నారు. 2023 జనవరి తరువాత పేదల భూములను స్వాధీనం చేసుకున్న భూస్వాముల నుండి ఎర్రజెండా సాక్షిగా తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్ర చేస్తుందన్నారు. బిజెపిని లేకుండా చేయడానికి కార్మికులు కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు.

ఎస్‌కె.సాబ్జీ



ఐ.వెంకటేశ్వరరావు

బి.వెంకట్

వి.వెంకటేశ్వర్లు

ర్యాలీలో గిరిజనుల నృత్య ప్రదర్శన



బృందాకరత్‌ను సన్మానిస్తున్న ముస్లిం మహిళలు

రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పూర్వపు బిల్ కలెక్టర్, ప్రస్తుత రికార్డ్ అసిస్టెంట్ టి.నాగేంద్ర భూపాల్‌ను కమిషనర్ షేక్ షాహిద్ సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన రెవెన్యు సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్రమ శిక్షణ చర్యలు చేపట్టారు. 2018లో అప్పటి నగరపాలక సంస్థ కౌన్సిల్ పదవీకాలంలో ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థకు సహకరించి శ్మశాన వాటిక కబ్జా చేసిన స్థలానికి ఆస్తి పన్ను విధించి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో బిల్ కలెక్టర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించి ఆస్తి పన్నుల విధింపుపై పలు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో భాగంగా టి.నాగేంద్ర భూపాల్‌ను సస్పెండ్ చేయడంతోపాటు అతనికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని తెలిపారు.

వైద్య ఉద్యోగుల మహాసభకు పలువురికి ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈనెల 11వతేదీన విజయవాడలో జరుగనున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సర్వ జన మహాసభకు రావాలని పలువురు ప్రముఖులను సాదరంగా ఆహ్వానించే పనిలో ఉద్యోగ సంఘ నేతలు నిమగ్నమయ్యారు. ఎపి ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లా అప్పారావు నేతత్వంలోని ప్రతినిధి బృందం ముందుగా ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, పరిపాలన అధికారి డాక్టర్ పి.బాల ప్రకాశ రావు(బాలు)కి ఆహ్వానం అందజేసి విజయవాడ సభకు ఆహ్వానించారు. అదే విధంగా ప్రభుత్వాసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎవిఆర్.మోహన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లాం విద్యాసాగర్, కార్యదర్శి ఎన్‌ఎస్‌వి.రామకృష్ణ తదితర ప్రముఖులకు ఆహ్వానాలు అందజేశారు. మహాసభకు విచ్చేస్తున్న ఉద్యోగ సంఘాల పెద్దల సమక్షంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆస్కార్‌రావు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యోగుల సమక్షంలో ప్రధానంగా చర్చిస్తారని, ఈ సందర్భంగా నల్లా అప్పారావు వివరించారు.

పలువురు ప్రముఖులను కలిసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోవిందరావు, ఉపాధ్యక్షులు పొన్నాడ ప్రభాకరరావు, ఎం.పార్వతీశం, ఎం.కృష్ణారావు, ప్రచార కార్యదర్శి జివివి.ప్రసాద్ పాల్గొన్నారు.

టెస్ట్‌పేపర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ముద్రించిన
పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ ముద్రించిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తూనే సామాజిక స్పృహ కలిగిన సంఘంగా యుటిఎఫ్ అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనిలో భాగంగా సి, డి గ్రేడుల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పదో తరగతి మోడల్ పేపర్లను ముద్రించినట్లు తెలిపారు. ఈ మోడల్ బుక్లెట్లో ప్రతీ సబ్జెక్టుకు నాలుగు మోడల్ పేపర్లు చొప్పున ఆరు సబ్జెక్టులకు 24 మోడల్ పేపర్లు ఉంటాయని తెలిపారు. పేద విద్యార్థులకు ఈ మోడల్ పేపర్లు అందుబాటు రేటులో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.కుమార్ బాబ్జీ, బి.వీరబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనండి మహాప్రభో..!

మండలంలో పేరుకుపోయిన ధాన్యపు రాశులు - వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

'ధాన్యం కొనుగోలులో నూతన విధానం అమలు చేస్తున్నాం.. రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం.. వారిని ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తాం.. సొమ్ములు కూడా వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం.. రైతులు ఇబ్బంది పడకుండా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు చేస్తాం. గోనె సంచుల కొరత, తేమ శాతం ఇబ్బందులు వంటివి తలెత్తకుండా చూస్తాం..' ఇవి ధాన్యం కొనుగోలులో రైతులకు ప్రభుత్వం చెప్పిన మాటలు.. కానీ ప్రస్తుత పరిస్థితి దీనికి పూర్తిభిన్నంగా ఉంది.

రైతులు కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి నరకయాతన పడుతున్నారు. రకరకాల కారణాలు చెబుతూ ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం చేయడంతో రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం ఉండిపోతుంది. మరోవైపు వాతావరణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. చింతలపూడి మండలంలో రైతులు ధాన్యం మాసూళు పూర్తిచేసి 25 రోజులైంది. ధాన్యం మొత్తం రాసులుగా కల్లాలోన్లే ఉంది. కొత్త విధానంలో రైతులు ఒకింత అయోమయానికి గురవుతున్నా.. ఎదోలా అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మిల్లర్ల వద్ద తేమశాతం ఎక్కువగా, ఆర్‌బికెల వద్ద తక్కువగా నమోదు కావడంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. మరోవైపు రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉంచాల్సిరావడంతో, అర్ధరాత్రుళ్ల కాపలా కాసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే గోనె సంచుల కొరత కూడా రైతులను వేధిస్తోంది. సంచుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంచుల కోసం ఆర్‌బికెలకు వెళ్తుంటే వారు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 వేల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. ఎకరాకు 32 బస్తాల నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పంట చేతికొచ్చి, మాసూళ్లు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోలు మాత్రం నత్తనడకన సాగుతుంది. ఇది దళారులకు, రైస్ మిల్లర్లకు వరంగా మారుతుంది. ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో నూతన విధానం తీసుకొచ్చిన ప్రభుత్వం తేమశాతం చూపించి కొనుగోలును ఆలస్యం చేస్తున్నారు.

గోనె సంచుల కొరత

రైతులకు అవసరమైన గోనె సంచులను అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. సరిపడు గోనె సంచులున్నాయని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు పూర్తిభిన్నంగా ఉంది. సంచుల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పడిగాపులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇస్తున్న సంచులకు కూడా పెద్ద పెద్ద రంధ్రాలు ఉండటంతో అవి ఉపయోగపడటం లేదని పలువురు వాపోతున్నారు. 200 సంచులిస్తే వాటిలో వంద వరకూ ఉపయోగపడటం లేదని రైతులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో

రామిశెట్టి సత్యనారాయణ, రైతు, చింతలపూడి

దయచేసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి. వాతావరణం రోజుకోరకంగా ఉంటోంది. ఏదైనా జరిగితే చేతికొచ్చిన పంట మొత్తం నాశనమవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించండి ప్రతిరోజూ ఉదయం ధాన్యం ఆరబెట్టడం, సాయంత్రం పోగు పెట్టడం చాలా ఇబ్బందిగా ఉంది. మా బాధలు అర్థం చేసుకోండి.

గోనె సంచుల కోసం పడిగాపులు

సంకు సత్యనారాయణ, రైతు, చింతలపూడి

గోనే సంచుల కోసం పడిగాపులు పడుతున్నాం. ఉదయం వెళ్లితే సాయంత్రం వరకూ సంచులు ఇవ్వడం లేదు. ఇచ్చిన సంచుల్లో సగం వరకూ పెద్ద పెద్ద రంధ్రాలుంటున్నాయి. గతంలో ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ చూడలేదు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం కో-ఆర్డినేటర్ టివిఎస్.స్నేహన్

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్నేహన్

ప్రజాశక్తి - దెందులూరు

చిన్నతనంలో వివాహాలు చేసుకోవటం వల్ల ఆరోగ్యం పాడవుతుందని సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం కో-ఆర్డినేటర్ టివిఎస్.స్నేహన్ తెలిపారు. దీంతో బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని కొవ్వలి గ్రామంలో రెండు సచివాలయాలను గురువారం పరిశీలించారు. అక్కడ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సాయంత్రం కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్లో రక్షహీనత-బాలత వివాహాలు నిర్మూలన అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహన్ మాట్లాడుతూ బాల్య వివాహం చేసినా, దొంగతనంగా వివాహం చేసినా 2006 బాల్య వివాహ నిషేధ చట్టం సెక్షన్ 3 ప్రకారం చెల్లదన్నారు. బాల్య వివాహాలు చేసే రెండేళ్లు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. రక్తహీనత లేకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గోరు ముద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ సక్రమంగా అమలయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి యుక్త వయసు బాలికలకు తరచూ హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర మహాసభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి - చాట్రాయి

వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలకు మండలం నుంచి నాయకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మహిళా మండల కార్యదర్శి మేడేపల్లి మేరీ తెలిపారు. వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెంచాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం ద్వారా పని దినాలు పెంచాలని నినాదాలతో ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఆమెతో పాటు సిఐటియు మండల కార్యదర్శి కొలికి పోగు భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కూలీలు గోళ్ళమూడి రంగారావు, పొదిల సంజీవరావు, ఏకిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజుకు జాతీయ పురస్కారం

శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజం కోసం, ఆరోగ్య శాస్త్ర అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా 2021-22 సంవత్సరానికి అత్యుత్తమ సేవలకు గాను ప్రముఖ ఇఎన్‌టి వైద్యులు, ఐఎంఎ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరాజుకు జాతీయ పురస్కారం లభించింది. జాతీయ శాస్త్ర సాంకేతిక శాఖ చేత నోటిఫై అయి భారత ప్రభుత్వంతో గుర్తింపబడిన డాక్టర్ ఎకెఎన్.సిన్హా జాతీయ అవార్డుకు సి.శ్రీనివాసరాజు ఎంపికయ్యారు. అలహాబాద్ మెడికల్ అసోసియేషన్ కన్వెన్షన్ సెంటర్, ఉత్తరప్రదేశ్‌లో జరుగనున్న ఐఎంఎ సెంట్రల్ కౌన్సిల్ 83వ వార్షిక సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ఐఎంఎ కార్యవర్గం, నగరంలోని పలువురు వైద్యులు శ్రీనివాసరాజును అభినందించారు.

విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా సురేష్‌బాబు

సురేష్‌బాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నూజివీడు సబ్ డివిజనల్ ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా మానవ హక్కులకు పోరాడు-సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మండలంలోని ఈదర గ్రామానికి చెందిన అయ్యింకి సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దళిత గిరిజన ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, రాజకీయాలకు అతీతంగా బహుజనుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

జీలుగుమిల్లిలో...

పలుచోట్ల కాఫీ విత్ క్లాప్ మిత్రాస్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం గ్రామపంచాయతీలో గురువారం కాఫీ విత్ క్లాప్ మిత్రాస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఓ కె.మంగతాయారు తెలిపారు. గ్రామంలోని హరిత రాయబారులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు క్లాప్ మిత్రాలతో కాఫీ తాగటం ద్వారా ఒక మంచి ఆత్మీయ అనుభూతి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాళి శ్రీను, కార్యదర్శి దేవప్రియుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు : మండల పరిధిలోని చిననిండ్రకొలను గ్రామపంచాయతీలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం గ్రామపంచాయతీ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచాయతీ విస్తరణ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ చెత్త సేకరణ కోసం ప్రతి ఇంటికి వచ్చే క్లాప్ మిత్రలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశం నిర్వహించిన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.బాలామణి, గ్రామప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కంప్యూటర్ అందిస్తున్న వెంకటేశ్వరరావు

కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర గ్రంథాలయంలో విద్యార్థుల చదువుల కోసం కంప్యూటర్ అవసరమని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఐవి నరసింహారావు, గుడ్ల వెంకట కృష్ణారావు, పి.రంగారావు కోరిక మేరకు స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎన్.వెంకటేశ్వరరావు గురువారం కంప్యూటర్‌ను వారికి అందించారు. గ్రంథాలయ అభివృద్ధికి విద్యార్థుల అవసరార్థం కంప్యూటర్‌ను అందించిన వెంకటేశ్వరరావుకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ తరుపున పి.రంగారావు ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ సత్యనారాయణ

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల అభివృద్ధికి ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు ప్రణాళికా ప్రకారం బడ్జెట్ తయారు చేసి అమలు చేయాలని ఎంపిడిఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని మండలపరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు మెరుగైన విద్య

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నిరీక్షణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రేచర్లలో నాడు-నేడు పనులను గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యం దిశగా అందరం కలిసి పని చేయాలని సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది అని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ తిరుపతి స్వామి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 కార్యక్రమంలో భాగంగా తిరుమల దేవిపేట పంచాయతీలో గురువారం పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్త నుంచి సంపద తయారు చేయాలని తెలిపారు. గ్రామాలను పరిశుభ్ర మైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గంగరాజు, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం చోరీపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

శివపురంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే 24 గంటల్లో విగ్రహాన్ని తీసివేస్తామని హెచ్చరించారని, ఆ విధంగానే విగ్రహాన్ని మాయం చేశారని టిడిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుత్త వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని శివపురం గ్రామంలో వారం రోజుల కింద ఆవిష్కరించిన ఎన్‌టిఆర్ విగ్రహం చోరీకి గురవ్వడంతో పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, టిడిపి చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, పట్టణ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ భూషణం, ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, టిడిపి నాయకులు మాటూరి థామస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ భవానీప్రసాద్

పారిశుధ్యంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నీటి కొరత లేకుండా భావితరాలకు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనారోగ్యం బారిన పడకుండా జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ ఆర్గనైజేషన్ లోకల్ కన్వీనర్ యం.రాజారావు, కెపాసిటీ బిల్డింగ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, రిసోర్స్‌పర్సన్ గోవిందరాజులు, ప్రైడ్ ఇండియా డైరెక్టర్ పిఎస్ఎస్.గాంధీ మెప్మా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నవరత్నాల పేరుతో రాష్ట్రం అప్పులపాలు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రం బాగుపడుతుందని టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి పేర్కొన్నారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా 28వ డివిజన్ బిడి కాలనీ చెరుకుగట్టు సెంటర్ మూడు బొమ్మల వద్ద గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లిన బడేటి చంటి ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి పార్టీ తరుపున పోరాడతామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఇంట్లో ఏదో ఒక సమస్య ఉందని, అయితే ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేయడంతో ఎవరూ చెప్పడానికి ముందుకు రావడంలేదని చెప్పారు. సంక్షేమం ముసుగులో వైసిపి ప్రభుత్వం ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఇప్పటికే బిసిలంతా ఏకమయ్యారని, తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డినాగరాజు, 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణసురేష్, బెల్లం అచ్యుతమ్మ, కలవలపూడి చంద్రశేఖర్, రేక చిన్నారావు, మనపురు శివ, వీరబాబ్జును రామారావు, సింగవరపు శ్రీరాములు, కాకిరెడ్డి శేషవతార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ రమణకుమార్

అన్నార్తులకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కీర్తిశేషులు డాక్టర్ కె.రమణకుమార్ 'పేదల డాక్టర్'గా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో పేరొందారని కొయ్యలగూడెం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చిటికిన రమేష్ అన్నారు. కన్నాపురం రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఎంపీపి స్కూల్ (మెయిన్)లో రమణకుమార్ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయాలను కుమారుడైన సురక్ష హాస్పిటల్ అధినేత కె.దిలీప్‌కుమార్ అనుసరిస్తూ ఏజెన్సీ ప్రాంత వాసులకు ఉచితంగా వైద్య చికిత్స చేస్తున్నారన్నారు. ఐదేళ్ల నుంచి పేదలైన వారికి వైద్య చికిత్సతో పాటు, ఆపరేషన్లు, ఔషధాలు కూడా దిలీప్‌కుమార్ ఉదారంగా అందించారని ప్రశంసించారు. అనంతరం 150 మందికి పైగా అన్నార్తులకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చిటికిన రమేష్, వీరవరపు నివాస్, ఎస్‌కె అలీమ్, కండెల్లి శివ, మదుతూరి శ్రీనివాస్, ప్రేమానాయుడు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన'

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గురువారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల సమయం వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో అధికారులు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ అధికారులు తమ విధులకు హాజరై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 21 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండలంలోని ఏ గ్రామ సచివాలయం నుంచి ఏ సమస్యపై ఎలాంటి ఫిర్యాదుల సచివాలయ అధికారులకు అర్జీలు రాలేదని ఇఒపిఆర్‌డి టివి.సారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం గ్రామ సచివాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కార్యదర్శి జె.గిరజ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దర్భగూడెం పంచాయతీలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలైన మడకవారిగూడెం, కొత్త వీమలవారిగూడెం, రమణక్కపేటలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదో అని అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఒక్క వైసిపికే సాధ్యమైందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్సు పోసమ్మ, జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాసరావు, సర్పంచ్ సున్నం ఉషారాణి, కుంజా పార్వతి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, బి.శ్రీనివాస్‌రెడ్డి, మంటిసాల గాంధీ, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, రాముడు, రాఘవ రెడ్డి, ఎంపిడిఓ మంగతాయారు, డిటి సందీప్, ఎఇ ప్రసాద్, రాంపండు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

స్వచ్ఛగ్రామం కోసం సమిష్టి కృషి అవసరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్వచ్ఛగ్రామం కోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని ఎంపిడిఓ పి.మల్లీశ్వరి కోరారు. మండలంలోని వాడపల్లి గ్రామంలో వర్మికంపోస్టు కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు అందరు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయరాదన్నారు. గ్రామ వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులు గ్రామస్తులకు ఈ విషయమై అవగాహన కల్పించాలన్నారు. ఆరుబయట దోమలు, ఈగలు చేరి, నీరుపై, ఆహార పదార్థాలపై వాలడం వల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అందరు సమిష్టిగా గ్రామం పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సూరిబత్తిన శ్రీను, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యాంసుందర్, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ

విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

దంతాలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉంటారని దంత వైద్యులు దివిరెడ్డి దినేష్ బాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దంత వైద్యులు దివిరెడ్డి దినేష్ బాబు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు యువరాజు, బి.సుకుమార్, ఎం.శ్రీనివాసరావు, రత్నమాల, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

సమగ్ర వ్యవసాయ విధానంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సమగ్ర వ్యవసాయ విధానంతో రైతులకు ఆర్థికాభివృద్ధి కలుగుతుందని సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి సిటిఆర్ఐలో రైతులకు గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు సమగ్ర వ్యవసాయ విధానంతో పంటలు పండించడం వల్ల రైతుకు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తాడన్నారు. అనంతరం చిన్న సన్న కారు రైతులకు పశువుల పెంపకం వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఎస్‌సి సబ్ ప్లాన్ ప్రకారం పలువురు రైతులకు పశువుల దాణా అందించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ సుబ్బయ్య, సరళ, ఫార్మ్ మేనేజర్ జయకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, సింహాచలం, ప్రభు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శేషుమాధవ్

ప్రకటన

మహారాజశ్రీ 2వ అదనపు డిస్ట్రిక్ట్ మునిసిఫ్ వారి కోర్టులో తాడేపల్లిగూడెం

ఓ.ఎస్.నెం. 195/2019

కూతంపూడి చంద్రశేఖర వర్మ ...వాది

మరియు

ఉండపల్లి వీర్రాజు ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన ఉండపల్లి వీర్రాజు, తండ్రి: లక్ష్మణరావు, వ్యవసాయం, డో.నెం. 13-2/1, పాతర్ల్పాళ్యలి జంక్షన్, రైల్వే గేటు దగ్గర, గడివలస, బొబ్బిలి అను వారికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను బుద్ధిపూర్వకంగా పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పై నెంబరులో వాది గారు మీపై దావా వేసినందున ది.13-12-2022వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ పై కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు ఉన్నచో తెలియచేసు కొనగలరు. లేనిచో మీ పై పరోక్షముగ తీర్పు చెప్పబడును.

తాడేపల్లిగూడెం, యం.వి.ఆర్.కృష్ణ మోహన్
07-12-22. అడ్వకేట్, తాడేపల్లిగూడెం.

In The Court Of The Senior Civil Judge :: Bhimavaram

H.M.O.P.No. 77/2022

Petitioner: Dasari Jyothi

Respondent: Dasari Ramu, S/o. Apparao, C/o. Korada Surya Rao, Bhogam Vari Street, Near Sri Vinayaka Guri, 25th Ward, Velpuru Road, Tanuku, W.G.Dt.

పై నెంబరు హెచ్.ఎం.ఓ.పి.లో రెస్పాండెంటుకు నోటీసులు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను పంపించినను సదరు రెస్పాండెంటు ఉద్దేశ్యపూర్వకంగా అందుకొని యుండుటలేదు. కావున సదరు రెస్పాండెంటు నోటీసు అమలు నిమిత్తం ది.29-12-2022వ తేదీకి వాయిదా అయివున్నది. సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు సదరు రెస్పాండెంటు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏదైనా తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీపై పరోక్షముగా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

భీమవరం, సంధి మాణిక్యాలరావు
05-12-22. అడ్వకేట్, ఆకివీడు.

IN THE COURT OF THE 8th ADDITIONAL DISTRICT JUDGE, ELURU

E.P.NO.1/2016

IN

O.S.NO. 111/2012

Between:

Atluri Venkata Ratnakara Rao ...DHR

Vs

Pasupuleti Baby Ashalatha ...J.D.R

NOTICE

J.D.R.:

Pasupuleti Baby Asha Latha, D/o Rajendra Prasad, D.No.6-280, Venkatapuram Grama Panchayat, Eluru EJCJ.

Whereas the DHR filed Execution Application against the JDR for recovery of the Decree in O.S.No.111/2012 for sale of schedule property. The Honourable court order notice under order 21 Rule 54 C.P.C.

Whereas the notice addressed to the JDR in the above EP could not be served as last known address and the summons could not be served.

Whereas the Honorable court ordered notice of the JDR in the above named JDR by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on 22-12-2022 at 10.30 A.M. and state your objections if any. Lest the petition will be decided exparte.

(As per orders)

DEVULAPALLISREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru Advocates
Dt.05-12-2022 Eluru

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE :: ELURU

E.P.NO. 67/2020

In O.S.NO. 129/2014

Between:

Rompicherla Maruthi Narasimham ...Decree Holder

Vs

Krovvidi Ramamohanarao (died) & others. ...Judgement Debtors

SALE PUBLICATION

WHEREAS the DHR obtained mortgage decree against the JDRS above named and brought the below mentioned schedule mortgaged property i.e. hypotheca to sale in the above execution proceedings:

WHEREAS the Honourable Additional Senior Civil Judge, Eluru fixed the date i.e. 30-12-2022 for sale of the schedule property by public auction in the court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intend to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honourable Court on 30-12-2022 at 10.30 A.M. onwards and participate in the auction.

SCHEDULE

Wooden rafters Daba Building site bearing D.No.22B-3-8/1 and way site (comprising in two items) of a total extent of 125 Sq.yards situated in T.S.No. 1105 of 14th Block of Municipal E Ward, Eluru Municipal Corporation, Eluru, Eluru Sub-Registry.

1st Item: Daba Building site in an extent of 80-5-0 Sq.yards bounded by:
East: House and site of Sri. M.S.Rama chandrarao.
South: Way described in 2nd Item below.
West: Property of Smt. Tetali Padmavathi.
North: Site belonging to Railways.

2nd Item: Way site of an extent of 44-5-0 Sq. yards.
East: Property of Sri. M.S.Ramachandrarao.
South: Road.
West: Property of Sri. Susarla Suryanarayana.
North: Ist Item.

Within the said boundaries the property consisting in two items referred to above with all water, sanitary and electrical fittings.

DHR Value : Rs.15,00,000/-
JDRS Value: Not quoted
Amin Test Value : Rs. 90,00,000/-
Market value
As per regn. Dept : Rs. 58,45,925/-

Eluru, DEVULAPALLI SREERAM
30-11-22. D.KRISHNA SASTRY
Advocates, Eluru.